క్లుప్తంగా

అడ్మిన్లదే బాధ్యత

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాట్సాప్, ఫేస్ బుక్, ఇతర సోషల్ మీడియా గ్రూప్రుల్లో వచ్చే పోస్టులకు ఆయా అడ్మిన్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానిక ఎస్సై శ్రీరాముల శ్రీను అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా గ్రూప్లో అభ్యంతకర, తప్పుడు వార్తలు, వదంతులపై తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అభ్యంతకరంగా ప్రవర్తిస్తే ఆయా సభ్యుడిని తక్షణమే గ్రూపు నుంచి తొలగించాలని చెప్పారు. వివాదస్ప పోస్టులపై ఆడ్మిన్ చర్యలు తీసుకోకపోతే, ఆడ్మిన్‌పై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియా గ్రూపుల్లో విద్వేషాలు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం, వర్గపోరుకు దారితీసే పోస్టులు, మార్ఫింగ్ చేసిన విడియోలు, ఫొటోలు ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేవద్దని సూచించారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే ఐటీ చట్టం ఐపీసీ సెక్షన్ 153ఏ కింద శిక్ష విధిస్తారని, మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని ఎస్సై హెచ్చరించారు.

గొత్తికోయ గ్రామాల్లో 'పోషణ్ పక్వాడా'



ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, చిన్నారులు, స్థానికులు

ములకలపల్లి: గొత్తికోయ గ్రామాల్లో మంగళవారం 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూసుగూడెం సెక్టార్‌లోని వలస ఆదివాసీ గ్రామాలైన కొమ్ముగూడెం, సోయం గంగులునగర్‌లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషకాహార అవశ్యకతను వివరించారు. సామూహిక సీమంతాలు చేశారు. తల్లులు, గర్భిణులచేత ప్రతిజ్ఞ చేయించారు. పురవీధుల్లో ప్రదర్శన చేశారు. ఏసీడీపీఓ సీతారాములు, సూపర్‌వైజర్ జ్ఞానసుందరి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల మంజూరుపై హర్షం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి పనుల కోసం రూ.5కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా మంజూరు చేయడంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి శ్రీనివాస్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా నిధులతో కళాశాలలో నూతన భవన నిర్మాణం, ల్యాబ్ భవన మరమ్మతులు, రోడ్లు, సెమినార్ హాళ్లు, స్టోర్స్ వంటి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబంధు నగదు జమ చేసుకోవద్దు

అశ్వాపురం: రైతుబంధు డబ్బులు కొన్ని బ్యాంక్‌లు వ్యవసాయ రుణాలకు జమ చేసుకుంటున్నారని, అలా చేయొద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మండల నాయకుడు ఓరుగంటి రమేష్ అన్నారు. అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు డబ్బులు రైతులకు పంట పెట్టుబడి సాయంగా ఉపయోగపడే విధంగా ఉద్దేశించిందన్నారు. బ్యాంక్‌లు రైతుబంధు డబ్బులు రుణ ఖాతాల్లో జమచేసుకోవద్దన్నారు. రైతు రుణాలను రూ.2 లక్షల వరకు వడ్డీతో సహా మాఫీ చేసేందుకు సిద్ధంగా ఉన్నందున రుణాలను రీ షెడ్యూల్ లేదా వడ్డీతో కలిపి రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంక్‌లను కోరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లి మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల పక్షాన అండగా ఉంటామని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సీఐటీయు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కి మంగళవారం వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సమస్యల పరిష్కారానికి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కి లేఖ రాస్తానని తెలిపారు. అలాగే జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్ల సాధ్యమైనంత త్వరగా కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, ఎంబి.నర్సారెడ్డి, విజయ్, బాలు, చెన్నకేశవులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా గ్రంథాలయం

- అందుబాటులోలేని పుస్తకాలు
- అభ్యర్థులకు భారంగా కొనుగోళ్లు
- దృష్టి సారించాలంటూ నిరుద్యోగుల వేడుకోలు



అందుబాటులోకి రాని ట్రైబల్ కమ్యూనిటీ హాల్ ఆవరణలోని డిజిటల్ లైబ్రరీ

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గానికి మండలకేంద్రమైన మణుగూరులోని గ్రంథాలయం అలంకారప్రాయంగా మారింది. మూడు మండలాలకు గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఒక్కరే కావడంతో తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం సింగరేణి, ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు, ఆదేశాలిస్తున్న తరుణంలో ఉన్న ఒక్క గ్రంథాలయం తరచూ తెరవక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో కోట్లాది రూపాయలు వెచ్చించిన రెండు భవనాలు అలంకారప్రాయంగా మారగా, దీంతో దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరుకు గ్రంథాలయం గత జ్ఞాపకంగా మారుతోంది.

పుస్తకాల లేమి..

అశ్వాపురం, పినపాక, మణుగూరు మండలాల్లో ఉన్న గ్రంథాలయాలకు ఒకే ఇన్‌చార్జ్ కావడంతో పాత మణుగూరులోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న గ్రంథాలయం సమయానికి తెరుచుకోవడం లేదు. గ్రంథాలయం తరచూ మూసివేసి ఉండటంతో పాటు పర్యవేక్షణ కొరవడటంతో అక్కడ ఉన్న పుస్తకాలు, ప్రస్తుత మారుతున్న సమకాలీన అంశాలకు తగిన విధంగా లేవని ఉద్యోగార్థులు పెదవి విరుస్తున్నారు. సమితిసింగారంలో 2023 జనవరిలో ట్రైబల్ కమ్యూనిటీహాల్ ఆవరణలో రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీలో కంప్యూటర్లు వినయోగంలోకి తేకపోవడంతో మూలనపడుతున్నాయని నిరుద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మనగర్‌లోని ఐటీఐ కళాశాల ఆవరణలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన శాఖ గ్రంథాలయం నిర్మించి నెలలు దాటుతున్నా అవి నేటికి అలంకార ప్రాయంగానే మారాయని తెలుస్తోంది.

దృష్టి సారించాలి..

నిరుద్యోగులు, ఉద్యోగులు, సాహితీవేత్తలకు, సమాజ సేవలకు జ్ఞాన సముపార్జనకు అక్కరకు రాకుండా అలంకార ప్రాయంగా ఉన్న గ్రంథాలయాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిరుద్యోగులకు, అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచి వేలకు వేలు పోసి కొనలేని నిరుపేద నిరుద్యోగులకు ఆర్థిక భారం తప్పించాలని వేడుకుంటున్నారు.

లైబ్రరీలను తెరిపించండి



రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇస్తున్న క్రమంలో మణుగూరులో లైబ్రరీలో సరైన పుస్తకాలు లేకపోవడం బాధాకరం. అంతే కాకుండా కొత్తగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీ కూడా మూసి ఉంచడంతో ఇబ్బందులేర్పడుతున్నాయి. అన్ని విలువైన పుస్తకాలు కొనలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తేవాలి. ముత్యాలమ్మనగర్‌లోని శాఖ గ్రంథాలయం, పాత మణుగూరులోని లైబ్రరీలను తెరచి ఉంచాలి.

– సాగర్, పగిడేరు

కొనుగోలు భారం..



వివిధ రకాల ఉద్యోగ నోటిఫికేషన్లు పడుతుండటంతో రిఫరెన్స్ కోసం విలువైన పుస్తకాలు కొనలేని పరిస్థితి. ఆర్థిక భారంతో కూడుకున్నది. రోజు కూలీలకు వెళ్లే తమకు అధిక ధరల పుస్తకాలు కొనుగోలు కష్టంమైన విషయం. దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో గతంలో ఉన్న లైబ్రరీ తరచూ మూసివేసి ఉంటుంది. పర్యవేక్షణ లేక పాత పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– ప్రనూష, మణుగూరు

లారీ ఓనర్లకు అండగా పోరాటం



లారీ ఓనర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరుటౌన్: లారీ ఓనర్లు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని, వారికి సీపీఐ, ఏఐటీయూసీలు అండగా నిలుస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య అన్నారు. మంగళవారం లారీ ఓనర్స్ ఆఫీసులో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ముఠా, గుమ్మస్తా సంఘం, లారీ ఓనర్స్, కోల్ ట్రాన్స్‌పోర్ట్ అందరూ గతంలో ఐకమత్యంగా ఏఐటీయూసీ, సీపీఐలో ఉండేవారని గుర్తుచేశారు. కార్మికులు, కర్షకులు, పేద వారి కోసం సీపీఐ ఎర్రజెండా పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు ఫైనాన్స్ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లి లోడింగ్ పెంచే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వర్లు, ఆదర్ల సురేందర్, మిడిదొడ్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మృతుడికి ఎమ్మెల్యే నివాళి

బూర్గంపాడు: అంజనాపురం గ్రామానికి చెందిన మోరంపల్లిబంజర తేజావత్ సూర్యం సోమవారం మృతిచెందారు. సూర్యం మృతదేహానికి మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదు పర్యాయాలు మోరంపల్లిబంజర సర్పంచ్‌గా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక నాయకులున్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మణుగూరురూరల్: కాంగ్రెస్ మండల నాయకుడు పల్లపు తిరుమలేష్ కుమారుడు ముత్యాలరావు ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి గృహానికి వెళ్లి తిరుమలేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. దొబ్బల వెంకటప్పయ్య, ఎంపిటిసి గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేష్, పులిశెట్టి బాబు, బొజ్జ త్రిమూర్తులు, వనం సత్యనారాయణ, పోట్ల ముత్తయ్య, బోడ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ధరలకు రెక్కలు

అశ్వాపురం: మండలంలో ఇసుక ధరలకు రెక్కలు రావడంతో ఇల్లు నిర్మించుకునే సామాన్యులు లబోదిబోమంటున్నారు. మండలంలో గోదావరి పరివాహక ప్రాంతం ఇసుక రేవులకు అవకాశం ఉన్నా ప్రభుత్వం ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చింతిర్యాల, అమ్మగారిపల్లి, ఆనందాపురం, నెల్లిపాక లో ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుంది. గతంలో చింతిర్యాలలో గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపు నిర్వహించారు. మండలంలో కొందరు ట్రాక్టర్ యజమానులు గతంలో గోదావరి నుంచి ఇసుక తరలించి నిల్వ చేసుకోగా ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3000 నుంచి రూ.3500 వరకు విక్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను బట్టి ఇసుక ధరలు భారీగా పెంచుతున్నారు. ఇసుక ధరలు భారీగా ఉండటంతో ఇళ్లు నిర్మించుకునే వారు మరుగుదొడ్లు, చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టే వారు, సామాన్యులు ఇసుక ధరలపై భగ్గుమంటున్నారు. సామాన్యులు ఇసుక కొనలేక నిర్మాణాలు నిలివేస్తున్నారు. గృహ నిర్మాణదారులు పనులు లేక కూలీలు, మేస్త్రీలు రోడ్డున పడుతున్నారు. మండలంలో ప్రభుత్వం ఇసుక ర్యాంపు ఏర్పాటు చేసి తక్కువ ధరలో ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పర్ణశాలలో పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా మంగళవారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యూత్రా ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు,మహా సంకల్పం మంగళాష్టకాలు, జీలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టి కళ్యాణతంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, వెంకట్రామాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది శివ, రాము పాల్గొన్నారు.

భగత్‌సింగ్ అమరత్వం మరువలేనిది..

చండ్రుగొండ: స్వాతంత్రపోరాటంలో అమరత్వం చాటిన భగత్‌సింగ్ ధైర్యం సాహసాలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ అన్నారు. మండలకేంద్రం చండ్రుగొండలో పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం భగత్‌సింగ్ 93వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌లకు విప్లవ జోహార్లు అర్పించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల పోరాటపటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకుని నేడు దేశంలో నెలకొన్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఉమర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, టి.భీముడు, పాండు, రాంబాబు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్, రాజ్‌గురులకు జోహార్లు అందిస్తున్న పీవైఎల్ శ్రేణులు

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

చండ్రుగొండ: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ సంధ్యరాణి మంగళవారం పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. మండలంలోని మొత్తం 27 బూత్‌లను ఆమె పరిశీలించి సదుపాయల కల్పనపై సిబ్బందితో సమీక్షించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ అక్బర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

మణుగూరుటౌన్: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మణుగూరు ఎస్ఐ–1గా బదిలీపై వచ్చిన మేడ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, ఫ్రేండ్లీ పోలిసింగ్‌ను ఇనుమడింపజేస్తామన్నారు. జూదం, కోడిపందెలు, గంజాయి అక్రమ రవాణా అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ ఇంతకు ముందు ఆయన స్థానంలో పనిచేసిన ఎస్ఐ శ్రీనివాస్ అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

ప్రహరీ నిర్మాణానికి వితరణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని మంచికంటి నగర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయం ప్రహరీ నిర్మాణంకు మంగళవారం అశ్వాపురానికి చెందిన షాలిమర్ టూరిస్ట్ అన్సారీ ట్రావెల్స్ ఆధ్వర్యంలో గరికపాటి ఆంజనేరావు రూ.4వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ముప్పారపు సత్యనారాయణ, వాసిరెడ్డి కృష్ణప్రసాద్, చిటికెన భాస్కర్‌రావు, చిలకా వీరభద్రం, వెంకటరామయ్య, గురుస్వామి భద్రయ్య, రమణయ్య, వినోద్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

చర్లరూరల్: చర్ల మేజర్ గ్రామ పంచాయతీ బహిరంగ వేలం పాటలు బుధవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం మార్కెట్ ఆవరణలో నిర్వహించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ఆశీలు వసూలు, జంతువధ రుసుముతోపాటు పశువుల సంత వేలంలు నిర్వహించనున్నామని అన్నారు. ఈ వేలంలో ఎస్టీలు మాత్రమే పాల్గొనాలని, అందుకు కుల ధృవీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. వేలం కాలపరిమితి ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు మాత్రమే ఉంటుందన్నారు.

విజయవంతం చేయండి

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు ప్రాధాన్యతపై నేడు నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి పునాది, వజ్రాయుధం లాంటిది ఓటు అని తెలిపారు. నేటి సాయంత్రం 5గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించే ఈ ర్యాలీలో పినపాక నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ హాజరౌతారన్నారు. కళాశాల విద్యార్థులు, అధికారులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

హడావుడిగా రహదారి నిర్మాణం



బాలాజీ ఆలయం ఎదుట సీసీ రహదారి నిర్మాణ పనులు..

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి సంవత్సరమూ.. బ్రహ్మోత్సవాలు, హోలిని పురస్కరించుకుని జరిపిస్తూ ఉంటారు. ఈ సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 వ తారీకు (గురువారం) నుంచి ప్రారంభమై అయిదు రోజులు జరగనున్నాయి. మరో మూడు రోజుల్లో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి సిద్ధమౌతుండగా... స్వామి వారి ఆలయానికి తూర్పు గోపురం నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. సదరు కాంట్రాక్టర్ ఎన్నికల కోడ్ వస్తుందని ముందుగానే పని ప్రారంభించినట్లు ఉండేందుకు పదిహేను రోజుల క్రితమే సీసీ రోడ్డు నిర్మాణానికి డస్ట్ పోశాడు. సీసీ నిర్మాణానికి డస్ట్ పోసిన కాంట్రాక్టర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల ముందు నిర్మాణం చేపట్టడంపై ఆంతర్యం ఏమిటని స్వామి వారి భక్తులు ప్రశ్నిస్తున్నారు. బ్రహ్మోత్సవాల ముందు సీసీ నిర్మాణంతో అవస్థలు.. స్వామి వారి బ్రహ్మోత్సవాల ముందు సీసీ నిర్మాణం చేపట్టడం వలన భక్తులు ఇబ్బందులకు గురౌతారని గ్రామస్తులు వాపోతున్నారు. సీసీ నిర్మాణం అనంతరం కనీసం పదిహేను రోజుల నుంచి ఇరవై రోజులైన వాటర్‌తో క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి , స్వామి వారి కల్యాణానికి హాజరౌతారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాక పక్క రాష్ట్ర ఏపీలోని తిరువూరు ప్రాంతం నుంచి కూడా స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు వస్తారు.నిర్మాణంలో ఉన్న సీసీ పక్కనే స్వామి వారి కల్యాణ మండపం ఉంది. నిర్మాణంలో ఉన్న సీసీ పైనే భక్తులు, వాహనాలు తిరిగే అవకాశం ఉండడంతో సీసీ రహదారి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు, భక్తులు వాపోతున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో సీసీ రహదారి నాణ్యత దెబ్బతినే అకాశం ఉందని, అదేవిధంగా భక్తులకు ఇబ్బందులు తప్పవని పలువురు అంటున్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

మణుగూరుటౌన్: మండలంలోని రాజకీయ పార్టీలతో బుధవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఓటరు సహాయ నమోదు అధికారి, తహసీల్దార్ రాఘవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ, పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలన్నారు.

ఐదు గంటలకు భారీ ర్యాలీ..

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అలాంటి ఓటు ప్రాధాన్యత గురించి వివరించే ఉద్దేశంతో బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఓటరు సహాయ నమోదు అధికారి, తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. ఐదు గంటలకు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని అనంతరం అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారం, ఓటుపై ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధికారులు, యువత అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

జ్యోతిర్లింగ ఆలయ సందర్శన

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్నా అరుణాచలం అరుణాచలేశ్వర స్వామి వారిని భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి మంగళవారం దర్శించుకున్నారు.ముందుగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం ఆలయం చుట్టూ తిరిగి నిశితంగా పరిశీలించారు. ఆలయ వ్యవస్థాకుడు శివనాగస్వామి ఈఓకు ఆలయ జ్ఞాపికను అందజేశారు.



భద్రాచలం దేవస్థానం ఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న శివనాగస్వామి

క్షతగాత్రుడికి యువత సాయం

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం గ్రామ శివానే ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వాజేడు మండలం ఎడ్జర్లపల్లి గ్రామానికి చెందిన సోడి గణేష్ యువకుడు కింద పడి తీవ్ర గాయాలు కాగ అదే దారిలో వచ్చిన పర్ణశాల యూత్ క్షతగాత్రుడికి సహాయం అందజేసి 108కి సమాచారం అందించి మానవత్వం చాటుకున్న ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీనగరం గ్రామం వైపు నుండి మారాయిగూడెం గ్రామం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అతివేగంతో ఆర్లగూడెం గ్రామ శివారులో చెట్టును ఢీ కొట్టి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కాగా మారాయిగూడెం క్రికెట్ మ్యాచ్‌కు వెళ్ళి తిరిగి వస్తున్న పర్ణశాలకు చెందిన యువత ఆ క్షతగాత్రుడిని పరిశీలించి వెంటనే ఆటోలో బాధితుడిని తీసుకువస్తూ 108కు సమాచారం అందించడంతో ఎదురుగా 108 రావడంతో ఆ వాహనంలో ఇద్దరు యువకులు బాధితుడితో వెళ్లి వైద్యశాలకు చేర్చడం అభినందించాల్సిన విషయం. అపద సమయంలో బాధితుడిని వైద్యశాలకు చేర్చడంతో ఎంతో పరిణితి కనబరిచిన యువకులు తెల్లం హరికృష్ణ, వాగే భరత్ కుమార్, శివకుమార్, దుర్గ, తరుణ్ రెడ్డి,శివరాం, సందీప్ రెడ్డి, చరణ్, అభిరామ్, విజయ్‌లకు స్థానికులు అభినందనలు తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. గడిచిన మూడు రోజులుగా ఆలయం వద్ద వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, వివిధ రకాల హోమాలు జరిపించారు. ఆలయంలో సీతా సమేత శ్రీరామచంద్రస్వామి, పరివార దేవతా సమేత శిఖర, ధ్వజ యంత్ర, ముత్యాలమ్మ అమ్మవారి సహిత బొడ్డు రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నారు. అదే విధంగా ఆలయంలో విగ్రహాలను కూడా ప్రతిష్ఠించబోతున్నారు. భక్తులచేత క్షీరా, జలాభిషేకాలు చేయిస్తారు. నేడు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులంతా అధిక సంఖ్య తరలి రావాలని కమిటీ బాధ్యులు కోరారు.

ఆలయ 22వ వార్షికోత్సవం

ములకలపల్లి: మండల కేంద్రంలోని భక్త అభయాంజనేయ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ మంగళవారం వేకువజామున మేళతాళాలతో మంగళతోరణం కట్టారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహ దాత కొత్తగూడెంకు చెందిన మూలగుళ్ళ జగన్నాథం, శంకుతల దంపతులు పూజలో పాల్గొని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ పూజారి ముకుందల సత్యనారాయణశాస్త్రి, సురేష్ శర్మలు అభిషేకాలు చేశారు. భక్తజనం హనుమాన్ చాలీసా పఠనం చేశారు. స్థానిక వ్యాపారి బిక్కుమళ్ల శాంతి సుధాకర్, మిరియాల అవినాశ్ దంపతులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి



భద్రాచలంఅర్బన్: మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చండ్రుగొండ: సాయుధ తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుల ఆర్.వెంకటాచారి, పెద్దిని వేణు, రాయి రాజా, అబ్దుల్ రహెమాన్, వనమా వెంకటేశ్వర్లు, విప్పర్ల వెంకటేశ్వర్లు, జక్కంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ప్రజావర్గ పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే మల్లు స్వరాజ్యానికి ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటయోదురాలు మహిళా ఉద్యమ నేత మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురష్కరించుకుని మంగళవారం భద్రాచలంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ముందుగా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేశి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాటి నైజాం నవాబు దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా పటేల్ పట్వారీ జమిందారీ, జాకిర్దారీ, భూస్వాముల దోపిడీలకు వ్యతిరేకంగా సంఘం పెట్టి ఎర్రజెండా చేతబట్టి భూస్వాములను, నైజాం నవాబులు, రజాకారులను తరిమికొట్టిన వీర వనిత, విప్లవ ధృవతార మల్లు స్వారాజ్యం అని ఆయన గుర్తు చేశారు. రానున్న కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బి.నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి, సీనియర్ నాయకులు బీఎస్ శంకర్‌రావు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటరామారావు, నాదెళ్ల లీలావతి పట్టణ కమిటీ సభ్యులు ఎస్.నాగరాజు, శాఖ కార్యదర్శి జి.నాగలక్ష్మి, మురళీకృష్ణ, ముత్తయ్య, రాయల రాములు తదితరులు పాల్గొన్నారు.